

# బస్వాపూర్‌కు నిధులిచ్చేనా?

భువనగిరి మండలం బీఎన్ తిమ్మాపూర్ గ్రామం

## నృసింహసాగర్‌కు నిధుల కోసం నిర్వాసితుల నిరీక్షణ

- డబ్బులు వస్తేనే బాధితులకు పునరావాస చెల్లింపులు
- పరిహారం ఇస్తేనే ఖాళీ చేస్తామంటున్న నిర్వాసితులు
- ఇటీవల ప్రజాభవన్‌లో సీఎంకు వినతి పత్రం అందజేత
- రూ.150 కోట్లు కావాలని గతంలోనే ప్రతిపాదనలు
- 11.39టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్ట్ నిర్మాణం
- 90 శాతం రిజర్వాయర్ పనులు పూర్తి
- నిర్మాణం పూర్తయితే 2.50లక్షల ఎకరాలకు కాళేశ్వరం జలాలు

యాదాద్రి భువనగిరి, జవవరి 4 (నమస్తే తెలంగాణ) : కరువును తరిమి కొట్టేందుకు కేసీఆర్ ప్రభుత్వం రూ.1,652.26 కోట్లతో బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టింది. రిజర్వాయర్ నిర్మాణ పనులు ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయి. నీటిని నిల్వ చేయాలంటే బీఎన్ తిమ్మాపూర్ గ్రామాన్ని అక్కడి నుంచి తరలించాల్సి ఉన్నది. ఈ క్రమంలో తమ భూములకు నష్టపరిహారం, పునరావాసం కల్పిస్తేనే ఖాళీ చేస్తామని ఆ గ్రామస్తులు పట్టుబడుతున్నారు. నిర్వాసితుల కోసం రూ.150 కోట్లు అవసరమని అధికారులు చెబుతున్నారు. అవి వస్తేనే మిగతా పనులు వేగవంతం కానున్నాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో ఆ నిధులను విడుదల చేయాలని నిర్వాసితులు కోరుతున్నారు. ఇటీవల ప్రజా భవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సైతం అందించారు. కాగా, 11.39 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ఆలేరు, భువనగిరి, మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గాల్లోని 2.50లక్షల ఎకరాలకు కాళేశ్వరం జలాలు అందనున్నాయి.

కాళేశ్వరం ప్రాజెక్ట్ 16వ ప్యాకేజీలో భాగంగా 11.39 టీఎంసీల సామర్థ్యంతో జిల్లాలో బస్వాపూర్ ప్రాజెక్ట్‌ను చేపట్టారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.1652.26 కోట్లు కేటాయించింది. ఇప్పటి వరకు రూ.1557.69 కోట్ల పనులు పూర్తయ్యాయి. మొత్తం జలాశయం, ఎగువ, దిగువ కాల్వలు నిర్మించేందుకు 5,891 ఎకరాల భూసేకరణ చేపట్టారు. బస్వాపూర్‌లోని నీటిని దిగువ భాగానికి మళ్లించేందుకు ప్రధాన కాల్వతోపాటు ఆయా ప్రాంతాలకు డిస్ట్రిబ్యూటర్, మైనర్, సబ్ మైనర్ కాల్వలను నిర్మిస్తున్నారు. మొత్తం 13 డిస్ట్రిబ్యూటర్ కాల్వలను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి డిస్ట్రిబ్యూటర్ కెనాల్ ద్వారా ఆయా ప్రాంతాలకు సాగు నీరు అందేలా మైనర్లు, సబ్ మైనర్లు, క్రాస్ రెగ్యులేటర్ల నిర్మాణం చేపట్టారు.

### పునరావాసం కల్పిస్తేనే..

రిజర్వాయర్ నిర్మాణంతో బీఎన్ తిమ్మాపూర్, లక్ష్మీనాయక్‌తండా, చొంగల్‌నాయక్ తండా పూర్తిగా మునిగిపోతున్నాయి. అందుకోసం సామాజిక, ఆర్థిక, సమగ్ర కుటుంబ సర్వేను పూర్తి చేశారు. బీఎన్ తిమ్మాపూర్‌లో మొత్తం 585 ఇండ్లకు సంబంధించి పరిహారం చెల్లించాల్సి ఉంది. గ్రామాన్ని ఖాళీ చేయాలంటే నిర్వాసితులకు పరిహారం జమ చేయాలి. అప్పుడే తాము ఖాళీ చేస్తామని బాధితులు చెబుతున్నారు. ఇందుకోసం రూ.95 కోట్లు, వేరే ప్రాంతంలో పునరావాసం కల్పించేందుందుకు రూ.45 కోట్లు కావాలి. మొత్తంగా సుమారు 140 కోట్లు అవసరమవుతాయని అధికారులు గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అయితే ఎన్నికల కోడ్ రావడంతో అది పెండింగ్ పడింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో ఆ నిధులను విడుదల చేయాలని నిర్వాసితులు కోరుతున్నారు. ఇటీవల ప్రజాభవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

### చెల్లింపులన్నీ బీఆర్ఎస్ హయాంలోనే..

బస్వాపూర్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఇప్పటికే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లింపులు పూర్తయ్యాయి. భువనగిరి మండలం బీఎన్ తిమ్మాపూర్, యాదగిరిగుట్ట మండలం లప్పానాయక్‌తండాకు ప్యాకేజీ పూర్తయ్యింది. ఈ ప్యాకేజీలో భాగంగా ఒక్కో కుటుంబానికి రూ.7.60 లక్షలను ప్రభుత్వం అందించింది. ఇంట్లో మేజర్ పిల్లలు ఉన్నా.. వారికి కూడా ప్యాకేజీ వర్తింపజేసింది. బీఎన్ తిమ్మాపూర్‌లో మొదటి విడుతలో రూ.50 కోట్లతో 655 మందికి, రెండో విడుతలో 401మందికి రూ.33 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసింది. పునరావాసం కింద ఇళ్ల స్థలాలను ఇచ్చేందుకు భువనగిరి మండలం హుస్నాబాద్‌లో సర్వే నంబర్ 107లో 1,056 మందికి ఇండ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 200 గజాలు ఇచ్చారు.

### నృసింహసాగర్‌తో 2.50 లక్షల ఎకరాలకు కాళేశ్వరం జలాలు

నృసింహసాగర్ రిజర్వాయర్‌తో యాదాద్రి భువనగిరి జిల్లాతోపాటు నల్లగొండ జిల్లాలోని పలు మండలాలు సస్యశ్యామలం కానున్నాయి. సాగునీటితోపాటు తాగునీరు కూడా అందనున్నది. జిల్లాలోని ఆలేరు, భువనగిరి నియోజవర్గాలతోపాటు మోత్కూరు, నల్లగొండ జిల్లాలోని రామన్నపేట, చిట్యాల, చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం మండలాలకు సాగునీరు అందనున్నది. మరోవైపు నృసింహ రిజర్వాయర్ ప్రాంతం పర్యాటకంగా కూడా ప్రఖ్యాతిగాంచనున్నది. ఇక్కడ బోటింగ్, పార్కులు, మ్యూజికల్ ఫౌంటేన్లు ఏర్పాటు చేయాలని గతంలోనే ప్రణాళికలు చేశారు.

---

## సూర్యాపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని కోరలేదు

- మీడియాలో వచ్చిన కథనంలో వాస్తవం లేదు
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సూర్యాపేట, జనవరి 4 (నమస్తేతెలంగాణ) : సూర్యాపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని తనకు కేటాయించాలని కలెక్టర్‌కు లేఖ రాసినట్లు ఓ దినపత్రికలో (నమస్తే తెలంగాణ కాదు) వచ్చిన కథనంలో వాస్తవం లేదని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గురువారం తీవ్రంగా ఖండించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు క్యాంపు కార్యాలయాలు కట్టించడం జరిగిందన్నారు. తాను జిల్లా మంత్రిగా ఉన్నప్పటికీ హుజూర్‌నగర్ శాసన సభ్యుడిని కావడంతో అక్కడ తనకు క్యాంపు కార్యాలయం ఉందన్నారు. కాగా, తాను సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో అన్ని హంగులు ఉన్నాయని, మంత్రి క్యాంపు కార్యాలయానికి అనువుగా ఉంటుందని, అది తనకు కేటాయించాలని కలెక్టర్‌కు లేఖ రాసినట్లు పత్రికలో కథనం వచ్చిందన్నారు. అందులో వాస్తవం లేదని, తాను ఎలాంటి లేఖ రాయలేదన్నారు. ఇలాంటి వార్తలను ప్రజలు నమ్మవద్దని సూచించారు.

---

# కాంగ్రెస్‌లో ఫ్యామిలీ పాలిటిక్స్

## లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా అడుగులు

**త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నల్లగొండ కాంగ్రెస్ పార్టీలో కుటుంబ రాజకీయాలు రక్తి కట్టిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయాలతో ఉత్సాహంలో ఉండగా.. ఇదే సరైన సమయమని భావిస్తూ తమ వారసులను బరిలోకి దింపేందుకు పావులు కదుపుతున్నారు. నల్లగొండ స్థానంపై మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి కుటుంబం కన్నేయగా.. భువనగిరి లోక్‌సభ స్థానంపై కోమటిరెడ్డి కుటుంబం దృష్టి సారించింది. ఇప్పటికే ఐదు అసెంబ్లీ స్థానాలు మూడు కుటుంబాల చేతుల్లో ఉండగా.. తాజాగా రెండు లోక్‌సభ సీట్లపై రెండు కుటుంబాల నుంచే బరిలోకి దిగే యోచన చేస్తుండడంపై ఇతర ఆశావహుల్లో తీవ్ర అసంతృప్తి కనిపిస్తున్నది. ఇన్నాళ్లూ కేసీఆర్ కుటుంబంపై విమర్శలు చేస్తూ వచ్చిన ఈ పెద్దలే.. ఇప్పుడు తమ కుటుంబ సభ్యులను ఎలా తెరపైకి తేస్తారని ప్రశ్నిస్తున్నారు. దీంతో లోక్‌సభ ఎన్నికల ముంగిట కాంగ్రెస్ పార్టీలో మొదలైన ఇంటి పోరు ఆసక్తికరంగా మారుతున్నది.**

– నల్లగొండ ప్రతినిధి, జనవరి 4 (నమస్తే తెలంగాణ)



కుందూరు జానారెడ్డి



కుందూరు రఘువీర్‌రెడ్డి



**నల్లగొండ స్థానంపై జానా కుటుంబం కన్ను**

**భువనగిరి సీటుపై కోమటిరెడ్డి కుటుంబం పట్టు**

**ఇతర ఆశావహుల్లో తీవ్ర అసంతృప్తి**

**ఆసక్తికరంగా మారిన కాంగ్రెస్ ఇంటి పోరు**



కోమటిరెడ్డి లక్ష్మి



కోమటిరెడ్డి సూర్యపవన్‌రెడ్డి

అసెంబ్లీ ఎన్నికల్లోనే ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ముగ్గురు కీలక కాంగ్రెస్ నేతల కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యత లభించింది. హుజూర్‌నగర్, కోదాడ నుంచి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి పద్మావతి పోటీ చేసి గెలుపొందగా.. నల్లగొండ, మునుగోడు నుంచి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆయన సోదరుడు రాజగోపాల్‌రెడ్డి విజయం సాధించారు. ఇక నాగార్జునసాగర్‌లో మాజీ మంత్రి జానారెడ్డి తాను బరి నుంచి తప్పుకుని తన చిన్న కుమారుడు జయవీర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకున్నారు. వీరితో పాటు మొత్తం 12 స్థానాలకు గానూ 11 స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకున్నది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ ముఖ్యులు ఇప్పుడు లోక్‌సభ స్థానాలను సైతం తమ కుటుంబ సభ్యులకు దక్కేలా పావులు కదుపుతున్నారు. అందులో భాగంగానే ప్రస్తుతం జానారెడ్డి కుటుంబంతోపాటు కోమటిరెడ్డి కుటుంబం తమ పాలిటిక్స్ ప్రయత్నాలను ముమ్మరం చేశాయి.

### నల్లగొండపై జానారెడ్డి పట్టు

నల్లగొండ లోక్‌సభ స్థానంపై సీనియర్ నేత జానారెడ్డి సీరియస్ గానే పావులు కదుపుతున్నారు. పార్టీ అవకాశం ఇస్తే తాను బరిలో ఉంటానని ఇటీవలే జానారెడ్డి తన మనసులో మాటను వెల్లడించారు. వాస్తవంగా వయసు రీత్యా జానారెడ్డి పోటీకి దిగకపోవచ్చనే రాజకీయ వర్గాల అంచనా. తన చిన్న కుమారుడు జయవీర్‌రెడ్డిని ఇటీవలే నాగార్జునసాగర్ నుంచి ఎమ్మెల్యే గెలిపించుకున్నారు. ఇక పెద్ద కుమారుడు రఘువీర్‌రెడ్డిని కూడా లోక్‌సభ ఎన్నికల్లో బరిలోకి దింపితే తండ్రిగా తన బాధ్యత తీరిపోతుందన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది. అందుకే నల్లగొండ నుంచి తాను బరిలో ఉంటానని పార్టీ పెద్దలకు సంకేతాలిస్తూ సందర్భాన్ని బట్టి రఘువీర్‌రెడ్డిని తెర పైకి తేనున్నట్లు సమాచారం. రఘువీర్‌రెడ్డి కూడా ఎప్పటి నుంచో చట్టసభల్లో అడుగుపెట్టాలని ప్రయత్నాలు కొనసాగిస్తూ వస్తున్నారు. అసెంబ్లీ బరిలో తమ్ముడు నిలబడడంతో ఎలాగైనా సరే ఎంపీ బరిలో తాను నిలబడాలన్న పట్టుదలతో ఉన్నారు. అందుకు సీఎం రేవంత్‌రెడ్డితో ఉన్న అత్యంత సన్నిహిత సంబంధాలు కూడా తమకు తోడ్పడుతుందని జానారెడ్డి కుటుంబం భావిస్తున్నది.

### భువనగిరిపై కోమటిరెడ్డి కుటుంబం దృష్టి

ప్రస్తుతం కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రాష్ట్ర మంత్రిగా, ఆయన సోదరుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. తాజాగా లోక్‌సభ ఎన్నికలపైనా వీరి కుటుంబం దృష్టి సారించింది. భువనగిరి నుంచి తమ కుటుంబంలో ఒకర్ని బరిలోకి దింపేందుకు పావులు కదుపుతున్నారు. 2009లో పునర్విభజన నాటి నుంచి భువనగిరి స్థానంపై కోమటిరెడ్డి సోదరుల పట్టు కొనసాగుతున్నది. 2009, 2014లో రాజగోపాల్‌రెడ్డి పోటీ చేయగా 2018లో వెంకట్‌రెడ్డి ఇక్కడి నుంచి పోటీ చేసి ఎంపీగా గెలుపొందారు. దాంతో మరోసారి తమ కుటుంబ సభ్యులే బరిలో జాగ్రత్త పడుతున్నారు. అవకాశం వస్తే తన సతీమణి కోమటిరెడ్డి లక్ష్మిని పోటీ చేయించేందుకు రాజగోపాల్‌రెడ్డి యోచిస్తున్నారు. ఇదే సమయంలో కోమటిరెడ్డి బ్రదర్స్ పెద్దన్న కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి కుమారుడు డాక్టర్ సూర్యపవన్‌రెడ్డి కూడా పోటీకి సిద్ధమవుతున్నారు. ఇటీవల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తన తమ్ముడు, మంత్రి వెంకట్‌రెడ్డితో కలిసి మోహన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగానే తన కుమారుడు సూర్యపవన్‌రెడ్డికి భువనగిరి నుంచి ఎంపీగా అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిసింది. దీనిపై మరోసారి చర్చిద్దామని రేవంత్‌రెడ్డి అన్నట్లు సమాచారం. ఇదే సమయంలో ఎన్నడూ లేనిది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ మీడియాలో కోమటిరెడ్డి సూర్యపవన్‌రెడ్డి వేయించిన ప్రకటనలు కూడా అందుకు బలం చేకూరుస్తున్నాయి. మొత్తంగా భువనగిరిని తమ చేతి నుంచి చేజార్చుకోవద్దన్న పట్టుదలతో కోమటిరెడ్డి కుటుంబం కనిపిస్తుందన్నది నిజం.

### ఇతర ఆశావహుల్లో అసంతృప్తి..

ఇప్పటికే ఐదు అసెంబ్లీ స్థానాలు మూడు కుటుంబాల చేతుల్లో ఉండగా, తాజాగా రెండు లోక్‌సభ స్థానాలపైనా రెండు కుటుంబాలు కన్నేయడంపై పార్టీలోని ఇతర ఆశావహులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. నల్లగొండ ఎంపీ స్థానం సూర్యాపేటకు చెందిన పటేల్ రమేశ్‌రెడ్డికి ఇవ్వనున్నట్లు అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీ పెద్దలు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. జానారెడ్డి కుటుంబం రంగంలోకి దిగడంతో రమేశ్‌రెడ్డి పరిస్థితి ఏంటన్న సందిగ్ధం నెలకొన్నది. ఇక భువనగిరి స్థానంపై రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా పేరున్న చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆశలు పెట్టుకున్నారు. మరోవైపు మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ సైతం పోటీకి సిద్ధమవుతున్నట్లు సమాచారం. వీరితోపాటు మరికొందరు కూడా టికెట్ కోసం పార్టీ పెద్దల వద్ద ప్రయత్నాల్లో ఉన్నారు. ప్రస్తుత పరిణామాలతో వీరంతా తీవ్ర అసంతృప్తితో రగలిపోతున్నట్లు ఆ పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

---

## మా డబ్బులు ఇప్పించండి

- హిల్ కాలనీ హెడ్ పోస్టాఫీస్ వద్ద బాధితుల ఆందోళన

నందికొండ, జనవరి 4 : నందికొండ పైలాన్‌కాలనీ సబ్ పోస్టాఫీసులోని తమ ఖాతాల నుంచి డబ్బులను కాజేసిన మాజీ సబ్ పోస్ట్‌మాస్టర్ రామకృష్ణపై చర్యలు తీసుకొని, తమ డబ్బు ఇప్పించాలని ఖాతాదారులు కోరారు. ఈ మేరకు గురువారం హిల్‌కాలనీ హెడ్ పోస్టాఫీసు వద్ద ఆందోళన చేపట్టారు. తమ ఖాతాలకు పోస్టల్ అధికారులే బాధ్యులు కాగా.. డబ్బులు ఎందుకు ఇవ్వరని నిలదీశారు. తాము ఫిర్యాదు చేసి 20 రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న దేవరకొండ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మదన్‌మోహన్ బాధితులతో మాట్లాడారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని, ఖాతాదారుల ఓచర్ల పరిశీలన నల్లగొండలో చేపట్టాల్సి ఉన్నదని తెలిపారు. ఖాతాదారులు ఆందోళన చెందవద్దని, దర్యాప్తు పూర్తయ్యాక నగదును తిరిగి ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఖాతాదారులు రవి, మధు, చిన్నయ్య, రత్నమ్మ, జయశ్రీ, సంపూర్ణ, కోటేశ్వర్‌రావు, చెన్నకేశవులు పాల్గొన్నారు.



హిల్‌కాలనీ హెడ్ పోస్ట్ ఆఫీసు వద్ద ఆందోళన చేస్తున్న ఖాతాదారులు

---



## నల్లగొండ కౌన్సిలర్లకు బీఆర్ఎస్ విప్ జారీ

### ఈ నెల 8న చైర్మన్‌పై అవిశ్వాసం

నీలగిరి, జనవరి 4 : బీఆర్ఎస్ పార్టీకి చెందిన నల్లగొండ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డిపై కాంగ్రెస్ సభ్యులు అవిశ్వాసం పెట్టారు. దీంతో మున్సిపాలిటీలో విశ్వాసం నిరూపించుకోవడానికి ఈ నెల 8న సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లకు ఆ పార్టీ గురువారం విప్‌ను జారీ చేసింది. నల్లగొండ మున్సిపాలిటీలో మొత్తం 48 వార్డులు ఉండగా.. ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ చెరో 20 స్థానాలను గెలుచుకున్నాయి. బీజేపీ నుంచి ఆరుగురు, ఎంఐఎం నుంచి ఒకరు, స్వతంత్రులు ఒకరు విజయం సాధించారు. ఎక్స్ అఫీషియో ఓట్లతో నల్లగొండ మున్సిపాలిటీని బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకున్నది. చైర్మన్‌గా మందడి సైదిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే.. ఇటీవల శాసనసభ ఎన్నికలకు ముందు, ఫలితాలు వెలువడిన తరువాత బీఆర్ఎస్ కౌన్సిలర్లు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. దాంతో వారి సంఖ్య 36కు చేరగా చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అవిశ్వాసానికి ఈ నెల 8న సమావేశం నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన కౌన్సిలర్లకు ఆ పార్టీ విప్ జారీ చేసింది.

### విప్‌ను ధిక్కరిస్తే పదవికి గండం

2019లో కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర సర్కారు కొత్తగా మున్సిపాలిటీల చట్టం రూపొందించింది. ఆ యాక్ట్‌లోని సెక్షన్ 37 ప్రకారం అవిశ్వాసం పెట్టడానికి సగం సభ్యుల కంటే ఒకరు ఎక్కువగా ఉండాలి. వారు జిల్లా కలెక్టర్‌కు నోటీసు ఇవ్వాలి. జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ అవిశ్వాసం సమావేశం నిర్వహించేందుకు ఆర్డీఓ స్థాయి అధికారిని నియమిస్తారు. ఆ అధికారి సమావేశం నిర్వహించేందుకు తేదీని నిర్ణయించి సభ్యులకు, అవిశ్వాసం మోపబడిన వ్యక్తికి రాతపూర్వక నోటీసులు ఇస్తారు. సమావేశానికి హాజరైన సభ్యుల్లో మూడింట రెండు వంతులు అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తితే అవిశ్వాసం ఆమోదించినట్లు.. లేదంటే వీగిపోయినట్లుగా ప్రకటిస్తారు. అయితే.. తెలంగాణ మున్సిపాలిటీ చట్టం–2019లో కొన్ని ప్రొవిజన్స్ కల్పించబడ్డాయి. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ద్వారా ఎన్నికైన సభ్యులకు రూల్ 8 ప్రకారం విప్ జారీ చేసే అవకాశం ఉన్నది. విప్ నోటీసులను రాతపూర్వకంగా సభ్యులకు ప్రత్యక్షంగా గానీ, కుటుంబ సభ్యులకు గానీ అందజేస్తారు. అందుబాటులో లేకుంటే ఇంటికి గానీ అంటిస్తారు. అయితే.. చట్టసభల్లో మూడింట రెండు వంతుల మంది సభ్యులు పార్టీ మారితే విప్ వర్తించదు. కానీ.. స్థానిక సంస్థల సభ్యులకు ఈ నియమ నిబంధనలు వర్తించవు. మొత్తానికి మొత్తంగా పార్టీ మారినా పార్టీ గుర్తుపై గెలిచిన వారందరికీ విప్ వర్తిస్తుంది. వారు విప్‌నకు అనుగుణంగా చేతులెత్తాల్సి ఉంటుంది. లేకుంటే వారంలోపే జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ వారి సభ్యత్వాన్ని రద్దు చేస్తారు. 15 రోజుల్లో తిరిగి మళ్లీ ఎన్నికలు నిర్వహిస్తారు.

---

## నెలాఖరులోగా సీఎంఆర్ పూర్తి చేయాలి

**మిర్యాలగూడ మిల్లర్లతో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సమీక్ష**



మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

మిర్యాలగూడ, జనవరి 4 : రైస్ మిల్లర్లు ఈ నెల 30లోపు సీఎంఆర్ పూర్తి చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బియ్యం అందించాలని కలెక్టర్ శ్రీనివాస్ సూచించారు. మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో మిల్లర్లతో గురువారం సమావేశమయ్యారు. మిల్లుల వారీగా ఇప్పటి వరకు ఇచ్చిన సీఎంఆర్ వివరాలను స్థానిక అధికారుల నుంచి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 69 రైస్ మిల్లుల నుంచి 2100 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉన్నదని, ఈ నెల 30లోగా అందించాలని అన్నారు. సీఎంఆర్ ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఎఫ్‌సీఐ గోదాములను పరిశీలించి సకాలంలో ఏసీలు వస్తున్నాయా.. అన్‌లోడింగ్ జరుగుతుందా? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, మేనేజర్ నాగేశ్వర్‌రావు, ఆర్డీఓ చెన్నయ్య, సివిల్ సప్లయ్ డీటీ జావేద్, ఆర్ఐ సురేందర్‌సింగ్, మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి వెంకటరమణ చౌదరి పాల్గొన్నారు.

---

## నార్కట్‌పల్లి ఎస్ఐ సైదాబాబు సస్పెన్షన్



ఎస్ఐ సైదాబాబు(ఫైల్)

నార్కట్‌పల్లి, జనవరి 4 : పలు అక్రమాలకు పాల్పడినట్లు రుజువు కావడంతో నార్కట్‌పల్లి ఎస్ఐ సైదాబాబుపై సస్పెన్షన్ వేటు పడింది. సైదాబాబును సస్పెండ్ చేస్తూ ఐజీ తరుణ్‌జోష్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నాలుగు రోజుల క్రితం వీఆర్‌కు అటాచ్ చేస్తున్నట్లు అప్పటి ఎస్పీ అపూర్వరావు వెల్లడించారు. పేకాట ఆడుతున్న వారికి, ఇసుక అక్రమ రవాణాదారులకు సపోర్ట్ చేస్తూ సైదాబాబు లబ్ధి పొందినట్లు ఆధారాలు ఉన్నట్లు అపూర్వరావు తెలిపారు. గతంలో చిట్యాల, మర్రిగూడ మండలాల్లో పనిచేసే క్రమంలో పేకాటగాళ్లకు చేదోడుగా ఉంటూ అక్రమాలకు పాల్పడినట్లు ఐజీ విచారణలో తేలింది. గతంలో మిర్యాలగూడలో పనిచేసిన సమయంలోనూ సస్పెండ్ అవడం గమనార్హం.

---

## ప్రజాపాలన దరఖాస్తులను తప్పులు లేకుండా డేటా నమోదు చేయాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నీలగిరి, జనవరి 4 : ప్రజాపాలన దరఖాస్తుల డేటాను తప్పులు లేకుండా నమోదు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గురువారం నియోజకవర్గ, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, తాసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో వెబెక్స్ ద్వారా సమావేశం నిర్వహించి తగు సూచనలు చేశారు. మండలం యూనిట్‌గా అన్ని దరఖాస్తులను శుక్రవారం నుంచి ప్రజాపాలన గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తున్న టీమ్ లీడర్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు డేటా ఎంట్రీ నమోదు చేయాలన్నారు. తాసీల్దార్లు, మండల ప్రత్యేకాధికారులు పర్యవేక్షణ చేయాలని, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు మానిటర్ చేయాలని సూచించారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో మాత్రమే డేటా ఎంట్రీ నిర్వహించాలని సూచించారు. ఇందుకు కంప్యూటర్ ఆపరేటర్లను వినియోగించుకోవాలన్నారు. మండలంలో ఏ ఏ శాఖల్లో ఎన్ని కంప్యూటర్లు అందుబాటులో ఉన్నాయి? ఎంత మంది ఆపరేటర్లు ఉన్నారు? వంటి వివరాలు సేకరించాలని, దరఖాస్తులన్నింటినీ జనవరి 17లోగా డేటా ఎంట్రీ పూర్తి చేయడంతోపాటు స్టోర్ చేయాలన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శుక్రవారం శిక్షణ నిర్వహించి డేటా ఎంట్రీపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

---



కట్టంగూర్‌లో ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

## ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో కార్మికుల ధర్నా

కట్టంగూర్, జనవరి 4 : ప్రభుత్వం తమను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆటో యూనియన్ కార్మికులు గురువారం మండల కేంద్రంలో ధర్నా చేపట్టి భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా యూనియన్ మండలాధ్యక్షుడు మేడి శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించి తమ పొట్ట కొట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్యాసింజర్లు ఆటోలు ఎక్కకుండా బస్సుల్లో వెళ్తుండడంతో తమ కుటుంబాలు గడవడం కష్టంగా మారిందని పేర్కొన్నారు. ప్రభుత్వం తమకు జీవన భృతి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నగేశ్, దాసరి ప్రవీణ్, లతీఫ్, కొప్పు రాములు, తండు నాగయ్య చంద్రయ్య, గోపాల్, సైదులు, బద్దం శ్రీను, రవి, వెంకన్న, అంజి, నాగరాజు, యాదగిరి, రామలింగం, వెంకటేశం పాల్గొన్నారు.